# పట్టెడు మెతుకులకోసం

అవి గ్రామాలలో అలజడి రోజులు.

పైనుంచి ఏదో కిందపడ్డట్టు పెద్ద చప్పుడయింది.

''ఏమిటది? ఏమిటది?'' కేకలు పెడుతూ కూర్చున్న చోటినుంచి లేచి నాలుగుపక్కలా చూసింది బాపమ్మ.

చీకట్లు అలుముకుంటున్న సంధ్యవేళ అది. వీధితలుపు దగ్గరగావేసి, కర్ర దగ్గర పెట్టుకుని, గోడ కానుకుని కూర్చుంది బాపమ్మ. ఆమె మనమడు శ్రీరంగం ఆ సాయంత్రం ఆరుగంటల బస్సులో వస్తానని ఊరికి వెళ్ళాడు. అతడికోసం వంటచేసి ఎదురుచూస్తున్నది.

అంత చప్పుడయితే పిల్లి దూకిందేమో ననుకుంది. మళ్ళీ ఆమెకు సందేహం కలిగి చేతికర్రా, లాంతరూతో గదిలోకి వెళ్ళి చూసింది.

మనిషి నేలమీదపడి ఉన్నాడు.

''ఎవరు నాయనా నీవు? ఎక్కడినుంచి దూకావు? ఇదేమిటి ఒంటినిండా ఈ వాతలు? ఎవరయినా కొట్టారా? పారిపోయి వచ్చావా?'' ఆమె అతడిని కదిపి చూసింది.

శోషవచ్చి పడిపోయినట్టున్నాడు.

ఆమె తటాలున వంటయింట్లోకి వెళ్ళి మజ్జిగన్నం బాగా పిసికి పలచగా చేసి గొంతులో పోసింది.

కొంత సేపటి కతడు, ఊఁ-అంటూ కదిలాడు. మెల్లగా లేచి కూర్చున్నాడు ఇటూ-అటూ చూస్తూ.

"ఆకలి - ఆకలి." కడుపుమీద కొట్టుకుంటూ "పదిరోజులయినాది కడుపులో ముద్దపడి" చూపించాడు.

"నిజంగానా నాయనా? నేను అన్నంకలిపి తెస్తానుండు. అయ్యో. ఇన్నాళ్లు పస్తులున్నావా?"

ఆమె గబగబా వంటయింట్లోకి వెళ్ళి మనమడికోసం వండిన అన్నం, కూర ఒక విస్తట్లో వడ్డించి తెచ్చి అతడిముందర పెట్టింది.

విస్తరి చూడగానే అతడి కళ్ళు మిలమిల్లాడాయి.

"కూర్చుని నిదానంగా భోజనం చెయ్యి నాయనా? అంటూ మంచినీళ్ళ చెంబు తెచ్చి పక్కన పెట్టింది.

అన్నంలో కూర కలుపుకుని పెద్దపెద్ద ముద్దలుచేసి నోట కుక్కుకుంటున్నాడతడు. ఆమె తెచ్చిన మజ్జిగతో భోజనం ముగించాడు. చెంబెడు మంచినీళ్ళు తాగాడు.

కడుపు నిండగానే కళ్ళమీదికి నిద్ర తూగుతూ వచ్చింది. తిన్న విస్తరి మడిచి వీధిలో పారేసి వచ్చేటప్పటికి ఆమె ఒక చాప పరిచి దిండు తెచ్చిపెట్టింది.

దానిమీద అతడు చొప్పకట్ట పడ్డట్టు పడ్డాడు కళ్ళు మూసుకుపోయాయి ఒక్కనిమిషంలో. అతడు కొట్టినా తెలియని నిద్రలోకి జారుకున్నాడు,

ఆమె మనమడికోసం అట్లాగే కూర్చుంది.

పదిగంటలు దాటవచ్చేముందర మనమడు శ్రీరంగం వచ్చాడు.

"ఇంకా మేలుకుని కూర్చున్నావా మామ్మా? ఇప్పుడు గంట ఎంతయిందో తెలుసా?" చెప్పులు విడిచి పెరట్లోకి వెళ్ళి కాళ్లూ చేతులూ ముఖం కడుక్కుని వచ్చి పీటమీద భోజనానికి కూర్చున్నాడు

''ఇంత ఆలస్యమయిందేం శ్రీరంగం? ఆరుగంటలకే బస్సు వస్తుంది కదా ?"

"వేళకే అక్కడ బయలుదేరింది. మధ్య ఒక స్టాపులో కొంచెం గొడవ జరిగింది. జనం బస్సుచుట్టూ మూగారు కదలనివ్వలేదు."

"ఏడీ వాడు? ఎటు పరుగెత్తాడు? వెతికి పట్టుకోండి" కేకలువేస్తూ బస్సు చుట్టూ కర్రలు పట్టుకుని నిలబడ్డారు.

బస్సులో కూర్చున్నవాళ్ళకు సంగతేమిటో తెలియదు. అక్కడ మూగిన జనానికి చాలామందికి ఆ అరుపులెందుకో అర్థంకాలేదు. అడిగితే చెప్పేవాళ్ళు లేరు. బస్సులో కూర్చున్నవాళ్ళందరికీ, కిందికి లాగిపడేసి కొడతారేమోనని భయంవేసింది.

కండక్టరు, డ్రైవరూ బిక్కుబిక్కుమంటూ బస్సుదిగి దూరంగా ఉన్న చెట్టుకింద నిలబడ్డారు. చివర కా గుంపును వదిలించుకుని బస్సు బయలుదేరేసరికి రెండు గంటలు పట్టింది.

''ఏమిటో మామ్మా, ఇప్పుడు ఎక్కడచూసినా ఇట్లాగే ఉంది. నాలుగు రోజులనాడు నాన్న బజారునుంచి వస్తుంటే తలమీద కర్రతో ఎవరో కొట్టి పరుగెత్తారు. అక్కడికక్కడే ఒళ్ళుతెలియకుండా పడిపోయాడు నాన్న. ఎంతసేపటికో దారినపోయేవాళ్ళెవరో చూసి, ఇద్దరు మనుష్యుల సహాయంతో ఇంటికి తీసుకు వచ్చారు. అది ఉన్నఊరూ తెలిసినఊరూ కనుక సరిపోయింది. తెలియనిఊరైతే ఏమయ్యేది? ఇప్పుడు పరిస్థితులెట్లా ఉన్నాయంటే పాపంకదా అని ఎవరికయినా సహాయం చెయ్యబోతే వీపు చిట్లగొట్టి పంపిస్తారు.

శ్రీరంగం కబుర్లుచెబుతూ భోజనం చేస్తున్నంతలో బాపమ్మ చపాతీ తిని మజ్జిగ తాగింది.

''అయితే శ్రీరంగం! నాన్నకు బాగా దెబ్బతగిలిందా ? ఇప్పుడెట్లా ఉన్నాడు?'' గాలితాకిడికి ఆకు ఒణికినట్టు ఒణికిందామె.

"దెబ్బ బాగా తగిలింది. రక్తం కారింది. డాక్టరు వచ్చి ఒక ఇంజక్షనిచ్చి కట్టుకట్టాడు. రెండురోజులు వరసగా వచ్చి చూశాడు. దెబ్బతగిలిన రోజయితే ఇంట్లో ఎవరికీ భోజనాలు లేవు, నిద్రలులేవు. రెండు రోజులకు కళ్లు తెరిచాడు. దిండ్లకానించి కూర్చోబెట్టితే కూర్చోగలిగాడు. దవడలకు కూడా దెబ్బ తగిలిందేమో- నోరు సరిగా తెరవలేకపోతున్నాడు. అన్నం మజ్జిగలోవేసి బాగా పిసికి పలచగా చేసి నోట్లో పోస్తున్నారు."

"అయ్యో. నాయనా. ఎంతపని జరిగింది? నన్ను నాన్నదగ్గరికి తీసుకెళ్లు" ఏడవటం మొదలుపెట్టింది బాపమ్మ.

"ఇప్పుడు బాగానే ఉన్నాడు మామ్మా. అసలు ఈ సంగతి నీతో చెప్పొద్దని

అమ్మా, అన్నయ్యా అన్నారు. ఐస్నేందుకాలస్యమయిందని నీవడిగితే మాటమీద మాటవచ్చి నేను నోరుజారాను." అతడు ఆమెదగ్గర కూర్చుని విసురుతూ కబుర్లు చెప్పుతూ మరిపించాలని చూస్తున్నాడు."

"తగ్గిపోయింది నాన్నకు. ఈపాటికి లేచి నిలబడగలిగే ఉంటాడు. భయ పడకు మామ్మా. నాన్న నిన్ను చూడటానికి ఒకటి రెండు రోజుల్లో రావచ్చు."

"నిజమేనంటావురా? నన్ను చూడటానికి తనే వస్తాడా? వాడిని చూసి నెలరోజులే అయినా ఏమిటో బెంగగా ఉంది. కళ్లలో మెదులుతున్నాడు."

"నిజంగా వస్తానన్నాడు మామ్మా. నేను ఈ చిన్న విషయంలో అబద్ధ మాడతానా?" ఆమెను మెల్లగా మంచమ్మీదికి చేర్చి పడుకోబెట్టాడు. ఆమెకు దగ్గ రగా ఆ సావడిలోనే తనొక మంచం వేసుకుని పడుకున్నాడు.

తెల్లవారింది. బాపమ్మ తన దినకృత్యాలలో మునిగిపోయింది. పదిగంటల వరకూ వంటచేసి శ్రీరంగాన్ని భోజనానికి పిలిచింది.

ఆ సమయంలో శ్రీరంగం వీధి అరుగుమీద పదిమందిలో కూర్చుని చెబు తున్నాడు-

''ఇక్కడికి ఇరవై మైళ్ళ దూరాన ఒక పల్లెలో రాత్రిపూట మురికివాడలో రెండు గుడిసెలకు ఎవరో నిప్పు అంటించారు. అర్ధరాత్రివేళ ఆ చీకట్లో గుడిసెల్లో బుడ్డీదీపాలయినా లేవు. పొగ చుట్టివేసి మంటలు పైకి లేవగానే పెద్ద కేకలూ, అరుపులతో పసిబిడ్డల నెత్తుకుని ఆడవాళ్ళు బైటికివచ్చారు. కొందరు పెద్దపిల్లల నెత్తుకుని బైటికి తీసుకువచ్చారు. నడవలేని ముసలివాళ్లను ఇద్దరిద్దరు మోసుకు వచ్చి దూరంగా చెట్లకింద పడుకోబెట్టారు. అందరూ చేరి వాటిని చల్లార్చేసరికి మరోమూల గుడిసెలంటుకున్నాయని తెలిసి కొంతమంది ఆ దిక్కుకు పరుగులు దీశారు. ఆ రాత్రిపూట ఆ ఊళ్ళో ఉన్న గుడిసెలన్నీ ఎలా అంటుకున్నాయోగాని బూడిదరాసులయ్యాయి. జనం చల్లార్చినవాళ్ళు చల్లార్చినట్టే ఉన్నారు.

వాళ్లకు తిండికి గింజలులేవు. కట్టుబట్టలు తప్ప మారుబట్టలు లేవు. తల దాచుకోటానికి నీడలేదు. చెట్లకింద అల్లాడిపోతున్నారు జనం. పిల్లలు ముదుసళ్లు ఆకలికి అలమటించిపోతున్నారు. ఊళ్ళో అడుక్కొచ్చిన మెతుకులు ఎంతమందికి చాల్తాయి?

ఎన్ని ప్రాణాలు పోయ్యాయో? ఎంతమంది బిడ్డలు మాడి మసిఅయ్యారో? నడవలేని ముదుసళ్ళు ఎంతమంది ప్రాణాలు విడిచారో?"

శ్రీరంగం చెబుతుంటే అక్కడ చేరిన జనం "ఎంత దారుణం? ఎంత దారుణం?" ముక్కుమీద వేళ్ళేసుకున్నారు.

"అసలింతకూ కారణం తెలిసిందా?"

"ఆ మాటకు జవాబు చెప్పేవారెవరు? తెలిసినా చెప్పరు"

"నెమ్మదిగా అవే బయటపడతాయి."

వాళ్లను పంపించి శ్రీరంగం లోపలికివచ్చి భోజనం చేశాడు. మళ్ళీ వాకిట్లోకి వెళ్లబోతూ గదిలోకి వెళ్ళాడు.

అక్కడ చాపమీద మనిషి ఒళ్లుతెలియకుండా నిద్రపోతున్నాడు.

"మామ్మా, ఆ మనిషెవరు? దొంగ కాడు కదా ?'' అతడి చేతిలో కర్ర ఉంది.

"నాయనా శ్రీరంగం ? దొంగ అయితే మనం తిరుగుతున్న యింట్లో నిశ్చింతగా నిద్రపోతాడా ? వాడెవరో పొరుగూరివాడురా"

"ఎవరయితేనేం? నీకు తెలిసినవాడా?''

"నాకేం తెలుసురా? ఏదో పడ్డట్టు పెద్ద చప్పుడయితే లాంతరు పట్టుకెళ్ళి చూశాను ఒంటిమీద తెలివిలేదు. శోషవచ్చి పడిపోయాడు. నేనప్పుడు ఇంత అన్నం మజ్జిగలో పిసికి గొంతులోపోస్తే కొంత సేపటికి కళ్ళుతెరిచాడు. తరువాత విస్తట్లో అన్నంపెట్టి ముందరబెడితే గబగబా ఎప్పుడూ అన్నం చూడనివాడిలా నోట్లో కుక్కుకుని చెంబెడు నీళ్ళుతాగి ఆ చాపమీద పడుకున్నాడు."

"మామ్మా, నీవు అందరినీ నమ్ముతావు. ఇంటికి రానిస్తావు. వాడు చూడు-ఎంత దర్జాగా చాపమీద నిశ్చింతగా నిద్రపోతున్నాడో? నీవుఒక్కదానివీ ఉంటావు కదా? వాడేమయినా చేస్తే? ఇంతకూ ఎప్పుడొచ్చాడు ?"

''నిన్నరాత్రిరా. తిండి తినలేదంటే అన్నంపెట్టాను. ఎన్నాళ్ళనుంచీ తిండిలేదో మరి? పెట్టింది ఆవురావురుమంటూ తిన్నాడు. అన్నం కడుపులో పడగానే నిద్రపోయాడు. లేవగానే అడుగుదాం.''

"సరేలే. ఎవడో-ఏ దొంగో ఇంట్లోదూరితే అన్నంపెట్టి గదిలో చాపవేసి పడుకోబెట్టావా ? ఇంకా నయం నీ తల పగలకొట్టి ఇంట్లోఉన్న నాలుగు వస్తువులూ తీసుకుపోతే ఏంచేసేదానివి?''

''ఏయ్, ఎవరునీవు? ఇక్కడికెందుకు వచ్చావు?" కర్రతో కదిపాడు శ్రీరంగం.

వాకిటినిండా జనం పోగయ్యారు. కొందరు లోపలికి వచ్చారు.

అతడు దిగ్గున లేచాడు. ఒంటికి చొక్కాలేదు. చాలీచాలని ధోవతి కట్టుకుని ఉన్నాడు.

"అయ్యా, నా కడుపులో పట్టెడన్నం పడి పదిరోజులయింది. మా ఊళ్ళో గుడిసెలన్నీ కాక మరో రెండు ఊళ్ళల్లో తగలబడిపోయాయి. నావంటివాళ్ళం పదిమందిమి మండుతున్న గుడిసెలలోనుంచి పిల్లలను, పెద్దలను బయటకు తీసుకొచ్చాం. కాని అప్పటికే సమయం మించిపోయి ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అందరికీ కడుపులు మాడుతున్నాయి. పట్టెడన్నంపెట్టే దిక్కులేదు. పిల్లలు ఆకలికి అలమటించిపోతున్నారు. గంజినీళ్లకయినా వాళ్లదగ్గర ఏమీలేదు!"

"నీవా గుడిసెల్లోని వాళ్ళలో ఒకడివా?''

''కాదు, నాలాంటివాళ్ళు ఇంకా నలుగురు మంటలార్పుదామని వెళ్ళాం. ఒకదానివెంబడి ఒకటి- దానివెంట మరొకటి- మూడు-నాలుగు గ్రామాలలో గుడిసెలు వరసగా కాలిపోయాయి. మాలో ఒకడు ఊళ్లోకి వెళ్ళి నూకలు, బియ్యం, జొన్నలు ఏది దొరికితే అది తీసుకొచ్చి వాళ్ళకు అందజేశాడు.

మాకు కడుపులోకి తిండిలేదు. కంటిమీదికి నిద్రలేదు. ఒకఊళ్ళో పట్టెడు మెతుకులు వెయ్యమని గ్రామమంతా తిరిగా. ఏడ్చాను. చెయ్యిచాపి అడిగాను. ఎవరికీ జాలి కలగలేదు. ఎక్కడికి పోయినా దొంగను చూసినట్టు చూశారు. వెళ్ళిపొమ్మని కొట్టటానికి వచ్చారు. ఎటువంటివాడినయినా ఆకలి ఎంత పనైనా చేయిస్తుంది. ఒక సాయంత్రంవేళ ఒకఇంట్లో అందరూ టి.వీ. చూస్తుండగా వెనకనుంచి వెళ్ళి వంటయింట్లో జొరబడ్డా తెగించి. గిన్నెలో అన్నం కనబడ్డది. చేత్తో తీసుకుని తినబోయినా. గిన్నె చప్పుడికి ఇంటివాళ్ళంతా వచ్చారు.

ఇంకా ఇరుగుపొరుగులు కేకలకు బయలుదేరి వచ్చారు, కర్రలతో చావబాదారు. ఒళ్ళంతా వాతలుతేలింది.

అక్కడినుంచి తప్పించుకుని పారిపోయి ఇక్కడికి వచ్చా. మామ్మగారు గోడకానుకుని కూర్చున్నారు తలుపులేసుకుని. ఇంటివెనకకు వెళ్ళాను. అక్కడ చెట్టెక్కి ఇంటిమీదికి పాకాను. ఒకచోట అద్దంపెంకు తాపిఉంది. దానిని ఊడదీసి గదిలోకి దూకాను. ఆ చప్పుడుకు మామ్మగారు వచ్చారు. 'ఎవరు-ఎవరు' అంటూ లాంతరు పైకెత్తిచూశారు. పదిరోజులనుంచి తిండి లేకపోవటంవల్ల శోష వచ్చినట్లయింది. తోటి మానవుడిపట్ల దయగల తల్లి మజ్జిగరసం నోట్లోపోసింది. కడుపునిండా అన్నంపెట్టి చెంబెడు మంచినీళ్ళిచ్చింది. కడుపు బరువెక్కేసరికి కళ్ళు మూతలుపడ్డాయి. బాబయ్యా, నేను దొంగను కాను. తోటి మానవులను రక్షించాలని బయలుదేరినవాడిని. నా వంటిమీద వాతలెన్నో చూశారా? దొంగనని కొట్టిన దెబ్బలు."

చేతులు జోడించాడు.

అప్పటివరకూ అంతా విన్న మామ్మగారు లేచి నాయనా, మనిషికి ఆకారమే గాని మానవత్వం లేనిరోజులివి. నీవు నీవాళ్ళదగ్గరికి వెళ్లు. ఇక్కడ కూడా జనం నిన్ను బతకనివ్వరు. వెళ్లునాయనా. ఈ అన్నం దారిలో ఎక్కడయినా తిని నీళ్ళుతాగు." విస్తట్లో అన్నం, కూర వేసి పొట్లంగా కట్టి అతడిచేతికిచ్చింది.

అతడు ఒంగి ఆమెపాదాలనుకళ్ళకద్దుకుని వీధినవెళుతుంటే అతడి ఒంటిమీద వాతలు ఎర్రగా, నల్లగా పైకితేలి కొట్టవచ్చినట్టు కనబడుతున్నాయి. ఊరిబయటి వరకూ తరిమికొట్టినట్టు కర్రలు చేతబట్టుకుని జనం సాగనంపారు.

అతడు వెనక్కు తిరిగి చూసి బరువుగా ఊపిరి పీల్చుకున్నాడు.

వాళ్ళా మనుష్యులే ననుకోవటానికి అతడికి నాలుక తిరగటంలేదు.